క్లుప్తంగా

చీరల పంపిణీ

పెబ్బేర్ రూరల్ (శ్రీరంగాపురం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలోని నిరుపేద మహిళలకు గౌడుగు వెంకటస్వామి చీరలు, వృద్ధులకు టవల్స్ పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ హెచ్‌ఎంకు తీవ్ర గాయాలు

పెబ్బేరు: మండలంలోని తోమాలపల్లి సమీపంలోని 44వ జాతీయ రాహదారిపై రెండు బైకులు ఢీకోవడంతో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు నంబి శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వై.శాఖాపూర్‌కు చెందిన నంబి శ్రీనివాసులు పనుల నిమిత్తం గ్రామం నుంచి పెబ్బేరుకు వెళ్తున్న ఆయన తోమాలపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై యూ టర్న్ తీసుకుంటుండగా.. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు బైకుపై వెళ్తుతున్న శశాంత్ ఢీకొట్టాడు. దీంతో నంబి శ్రీనివాసులుకు తల కు తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్‌ఐ రామస్వామి మాట్లాడుతూ బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం



పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ పోరాటాలు కొనసాగిస్తుందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం, సమస్యలపై పోరాటం, పరిష్కారమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు ఇవ్వాలని, రేషన్ బియ్యం తగ్గింపు సరికాదని, పేదలకు సొంత స్థలాలు అందజేసి వాటిలో ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సహదేవ్, రాముడు, పరందాములు, కాకం రాముడు, శంకరయ్య, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు హరీష్ పాల్గొన్నారు.

మడివాళ్ల మాచయ్య జయంతి



అమరచింత: పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురపస్కరించుకొని రజకుల కుల దైవమైన మడివాళ్ల మాచయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలోని మాచయ్య ఆలయంలో పూజలను నిర్వహించారు. శివ స్వాములకు అన్నదానంతో పాటు ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సుతారి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సవరన్న పాల్గొన్నారు.

జనం కోసం పర్యటన



పెబ్బేరు: వనపర్తి నియోజక వర్గంలోని జనం సమస్యలు తెలుసుకోవడానికి జనసేన గ్రామాల పర్యటన చేస్తుందని సోమవారం వనపర్తి కోఆర్డినేటర్ ముకుందనాయుడు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పెంచికలపాడులో నాయకులతో పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌నాయుడు, నరసింహ, రాము, గోవిందు, అశోక్‌కుమార్, హరిష్, శంకర్, భాస్కర్, రాజేష్ కుమార్, సంజీవ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

పాన్‌గల్: కేంద్రంలోని బీజేపీ ఎస్సీ వర్గీకరణ చేపట్టేలా జ్ఞానోదయం కలిగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి బొల్లిగట్టు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు రాజేష్, కొమ్ము చెన్నకేశవ్, ఎర్రం నాగేంద్రం, గంధం శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ చేపడితే బొల్లిగట్టు ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేపడతామని చెప్పి తొమ్మిదేళ్లు కావస్తున్నా వర్గీకరణ హామీ అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో ఎర్రం సిద్దయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.





బృందావన్ టాకీస్ వద్ద..



ఆత్మకూర్‌లో..



అమరచింతలోని శ్రీకృష్ణ నగర్‌లో..



ఖిల్లాఘనపురంలో..

సంతోషాల సంక్రాంతి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సంక్రాంతి వేడులకను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటి వాకిళ్లలో రంగ వల్లికలు, గొబ్బెమ్మలు ఉంచారు. యువకులు, చిన్నారులు పతంగులు ఎగరవేసి ఉత్సాహంగా గడిపారు. కనుమ పండుగ పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జంగిడిపురంలో కాలనీవాసులతో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పాలు పొంగించారు. అలాగే మండలంలోని చందాపూర్‌లో ఉపసర్పంచు ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి విజేత ప్రసన్నకు రూ.4,116, రెండో బహుమతి మనీషా రూ.3,116, మూడో బహుమతి కావేరి రూ.2,116 అందించారు

ఖిల్లాఘనపురం: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఖిల్లాగట్టు, దొంతికుంటతండా ఆంజనేయస్వామి, తిర్మలాయపల్లి తిర్మలేశుడి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, అల్లమాయపల్లి, మానాజీపేట, హీర్లతండా తదిత గ్రామాల్లో పండుగ సందర్భంగా ఎద్దుల బండ్ల ఊరేగింపు చేశారు. అప్పారెడ్డిపలిలో గ్రామస్తులు పెద్ద ఎత్తున గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయం నుంచి చెన్నకేశవస్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అప్పారెడ్డిపల్లి సర్పంచ్ కృష్ణవేణి, ఖిల్లాఘనపురంలో గంగపుతర సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలకు బహుమతులు అందించారు.



వనపర్తిలోని జంగిడిపురంలో కాలనీవాసులతో కలిసి పాలు పొంగించిన వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

అమరచింత: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆడపడుచులు తమ ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులతో ఇంటి వాకిళ్లను అందంగా అలంకరించారు. గ్రామాల్లో యువకులు క్రీడాపోటీలను నిర్వహించుకున్నారు. కబడ్డీ, క్రికెట్ ఆటలతో యువకులు ఆనందంగా గడపగా.. చిన్నారులు, యువతులు రంగురంగుల గాలిపటాలను ఎగుర వేశారు.

పాన్‌గల్: మండలంలోని గ్రామాల్లో ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపు నిర్వహించారు. దీంతో పాటు మండలంలోని బుసిరెడ్డిపల్లిలో బొల్లిగట్టు ఉత్సవాల్లో భాగంగా గుట్టపై వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కవిత, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్ల వాకిళ్లలో రంగుల ముగ్గులను వేసి పిల్లపాపలతో పండుగ సంబరాలు చేసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



చందాపూర్‌లో..



పాన్‌గల్‌లో ఎద్దుల బండ్ల ఊరేగింపు



అప్పారెడ్డిపల్లిలో..



చందాపూర్‌లో..

మాయావతితోనే బహుజనులకు రాజ్యాధికారం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి జన్మదినాన్ని పురస్కరించుకొని బీఎస్పీ నాయకులు ఆమె చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ సారథ్యంలో మాయావతిని ప్రధాని చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఘనపురం కృష్ణయ్య, సత్యం సాగర్, రాంబాబు, సుజాత, విజయ్, చామంతి, వెంకటయ్య, ధర్మన్న, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేర్ రూరల్ (శ్రీరంగాపురం): బహుజనుల ఆత్మగౌరవ పుత్రిక, బహుజన సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయవతి జన్మదినాన్ని ఆ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్, నియోజకవర్గ కార్యదర్శి, ఎంపీటీసీ ఎల్లస్వామి, బీసన్న, భాస్కర్, చంద్రశేఖర్, శివ, రాము, కృష్ణ, జగన్, పవన్, మధు, రాఘవేందర్, నవీన్, భాను, సంజయ్, భగవంతు, సుమన్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాయావతి జన్మదినాన్ని బీఎస్పీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్, వనపర్తి అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మొల్గర తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, బదుగని మల్లేష్, మన్నెం, రామాంజనేయులు, చెన్నయ్య, లక్ష్మీనరసింహ, యాదయ్య, స్వామి, నర్సింహ, రామకృష్ణ తదతరులు పాల్గొన్నారు.

ప్రవక్త చూపిన మార్గంలో పయనిద్దాం

అమరచింత: మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించి, అందరితో సేవాభావంతో కలిసి ఉండాలని కర్ణాటకలోని హల్‌కట్ట దర్గా షరీఫ్ పీఠాధిపతి హజరత్ మౌలాన ఖ్వాజా సయ్యద్ అబుతరబ్ షా ఖాదిరి సాబ్ అన్నారు. పట్టణంలోని జామీయా మసీదు ప్రాంగణంలో రూ.17 లక్షలతో నిర్మించిన వజూఖాన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా పవిత్ర నమాజు అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషి నివాసం ఉండటం కోసం ఇళ్లు ఉన్నట్లే నమాజ్ చేసే మసీద్‌లు అల్లా నివాసాలు అన్నారు. పట్టణంలోని జామీయ మసీదులో వజూఖాన లేదని గతేడాది తమ దృష్టికి సమస్యను తీసుకురావడంతో తమ వంతుగా వజూఖానాను నిర్మించామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జామీయా నిజామియా హజరత్ ఉల్లామ ముఫ్తి ఖలీల్ అహ్మద్‌షా, మౌలానా అల్తాఫ్ బేగ్, మోషీన్ ఖాద్రీ, జమీయా మసీద్ కమిటీ సభ్యులు ఖదీర్, మైనద్దీన్, అన్సార్, తౌఫిక్, రఫీ, షాషా, అయ్యూబ్, నిస్సార్ తదితరులు పాల్గొన్నారు.



హల్‌కట్ట పీఠాధిపతిని సన్మానిస్తున్న మసీద్ కమిటీ సభ్యులు

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాన్‌గల్: మండలంలోని మాధరావుపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన రొడ్డ శే కరయ్య, రేమద్దులలో విద్యుదాఘాతంలో మృతిచెందిన కిల్లె శంకర్, అనారోగ్యంతో మృతిచెందిన కతాల్ మాతృమూర్తి నర్సమ్మ కుటుంబాలను ఆదివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సహదేవ్‌యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం గ్రామంలో నిర్వహించిన దశదిన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పంపిన రూ. 20 వేల ఆర్థికసాయాన్ని కొల్లాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేఖర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రాముడు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌యాదవ్, గోపాల్, వెంకటయ్య పాల్గొన్నారు.



మాధవరావుపల్లిలో మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జూపల్లి

ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే బీరం

వీపనగండ్ల: సంగినేనిపల్లి సమీపంలో వెలసిన లక్ష్మీ నరసింహాస్వామి ఆలయానికి అన్ని వసతులు సమకూర్చాలన్న సదుద్దేశంతోనే ఆలయానికి ఇరువైపులా బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ.4 కోట్లు మంజూరు చేయించామని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆయన లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని దర్శించించారు. తూంకుంట నుంచి నరసింహాస్వామి గుట్టలో వెలసిన ఆలయానికి బీటీ రోడ్డు నిర్మిస్తామని, అలాగే మండల కేంద్రం నుంచి సంగినేనిపల్లి, చిన్నతండా గ్రామాల మీదుగా బీటీ రోడ్డును కూడా ఈ నిధుల ద్వారానే నిర్మించనున్నట్లు తెలిపారు. రోడ్లతో పాటు ఆయాలనికి అవసరమైన నిధులను మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సుదర్శన్‌రెడ్డి, వేణుమాధవ్‌రెడ్డి, తేజారెడ్డి, ముంత మల్లయ్య యాదవ్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

వైభవంగా లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవాలు

సంగినేనిపల్లి సమీపంలోని గుట్టల్లో వెలసిన లక్ష్మీనరసింహాస్వామి ఉత్సవాలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆలయానికి ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్లతో ఊరేగింపుగా వచ్చి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. తూంకుంట, సంగినేనిపల్లి, వల్లభాపురం, వీపనగండ్ల, సంపత్‌రావుపల్లి తదితర గ్రామాల నుంచి దాదాపు 6వేల మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. కొద్దిపాటి గుట్టలపై స్వామివారు వెలసి ఉండడం ఈ ఆలయ ప్రత్యేకతగా చెప్పవచ్చు. సంగినేనిపల్లికి చెందిన మత్స్యకార యువజ సంఘం సభ్యులు ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ అన్నదానం చేశారు.

‘కంటి వెలుగు’ను విజయవంతం చేయాలి

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల19 తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమన్ని విజయవంతం చేయాలని మండల మెడికల్ ఆఫీసర్ రాముడు కోరారు. మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు.

రిటైర్డ్ సైనికులకు సన్మానం

వనపర్తి టౌన్: గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలను కలుపుకొని వనపర్తిలోనే మిలిటరీ క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రిటైర్డ్ సైనికులు వెంకటస్వామి, రవీందర్, అంజయ్య, వెంకటస్వామి, రాంబాబు, జగదీశ్వర్‌ను టీజేఏసీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైనికులకు పదవీ విరమణ తర్వాత 5ఎకరాల భూమిని ఇస్తున్నారని, దీంతో పాటు ఇంటి స్థలాన్ని సైతం కేటాయించాలని కోరారు. రిటైర్డ్ సైనికులను బ్యాంక్‌ల్లో, ప్రైవేట్ కంపెనీల్లో గార్డులుగా పని చేయడం బాధకరమైన విషయమని, మాజీ సైనికులను గుర్తించి రిజర్వేషన్ 10శాతానికి పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విష్ణునాయుడు, గోపాలకృష్ణ నాయుడు, సుభాష్ శెట్టి, రుద్రారెడ్డి, ప్రవీణ్ కుమార్, లలిత పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెల్యూట్ చేస్తున్న రిటైర్డ్ సైనికులు, ప్రజా ప్రతినిధులు

విజేతలకు బహుమతుల ప్రదానం

కొత్తకోట: మండలంలోని సంకిరెడ్డిపల్లిలో సామాజిక కార్యకర్త ఎన్ఆర్ఐ అమర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి అమర్‌రెడ్డి దంపతులు బహుమతులు అందజేశారని సర్పంచ్ శివరాజ్ తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాంతిభూషణ్ ఉన్నారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని గట్లఖానాపూర్‌లో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ఎంపీపీ మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు మొగిలి సత్యారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో కొత్తకోట టీం మొదటి బహుమతి కింద రూ.10,116 సాధించగా, రెండో బహుమతి మద్దిగట్ల టీం రూ.5,116 గెలుపొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట్ల వెంకటేష్, వనపర్తి మార్కెట్ కమిటి డైరెక్టర్ శివశంకర్ ఉన్నారు.

పామిరెడ్డిపల్లిలో..

పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ముగ్గులు, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు మన్నె రాజవర్ధన్‌రెడ్డి ఆర్థిక తోడ్పాటుతో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, సర్పంచ్ సిద్దయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి బహుమతులు అందించారు. కబడ్డీ సీనియర్ విభాగంలో చరణ్‌రెడ్డి జట్టు మొదటి స్థానంలో నిలవగా.. రామాంజి జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందింది. క్రికెట్ పోటీలో మొదటి స్థానంలో నిలిచిన రాయల్ చాలెంజ్ జట్టుకు ఏఎస్‌టీఓ శంకర్ రూ.2,116 అందించగా.. రెండో స్థానంలో నిలిచిన అవెంజర్స్ జట్టుకు ఫొటోగ్రాఫర్ శ్రీశైలం రూ.1,116, అందించారు. కార్యక్రమంలో ప్రకాశ్‌రెడ్డి, మహనంది, లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పామిరెడ్డిపల్లిలో విజేతలకు బహుమతులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెబ్బేర్‌రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని తాటిపాములలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఆదివారం సర్పంచ్ సత్యనారాయణయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పార్వతమ్మ, ఉప సర్పంచ్ కుర్మన్న, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నవీన్ రెడ్డి, వార్డు సభ్యులు ఆంజనేయులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: సంగినేనిపల్లి, వీపనగండ్ల గ్రామాల్లో వేర్వేరుగా నిర్వహించిన క్రికెట్, వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు ఎస్‌ఐ రామన్‌గౌడ్, జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, ముంత మల్లయ్య యాదవ్ బహుమతులు అందజేశారు. ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్టు ద్వారా సంగినేనిపల్లిలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి ప్రోత్సాహకంగా రూ.6000, రెండో బహుమతిగా 3వేలు, ట్రస్టు చైర్మన్ ఇంద్రకంటి వెంకటేశ్ ఎస్‌ఐతో కలిసి క్రీడాకారులకు అందజేశారు. అలాగే మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ముంత మల్లయ్య యాదవ్ నగదు, బహుమతులు అందజేశారు. సంగినేనిపల్లి సర్పంచ్ మౌలాలీ, పద్మం విజయభాస్కర్‌రెడ్డి, రాంరెడ్డి, ధనుంజయ, లక్ష్మయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.



వీపనగండ్లలో..



తాటిపాములలో..



సంకిరెడ్డిపల్లిలో..



గట్టుకాడిపల్లిలో..

సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

ఆత్మకూర్: మండలంలోని జూరాల గ్రామంలో ప్రారంభించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం ఏమిటని బీజేపీ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం గ్రామస్తులతో కలిసి స్థానిక ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పది నెలల కిందట మొదలు పెట్టిన పనులు 15 రోజుల వరకు చేపట్టి చేతులు ఎత్తేశారని, దీని కారణంగా విద్యుత్ సమస్యతో రైతులు, గ్రామస్తులు సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. పనులను వెంటనే పూర్తి చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ట్రాన్స్‌కో ఏఈకి అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయరాజ్, రఘు, రాజు ,గోపి, నరేందర్ గౌడ్, కొండాపురం రాము, చెన్నప్ప, సాయిలు ఉన్నారు.



ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నిత్యావసర సరుకుల అందజేత



ఆత్మకూర్: పట్టణంలో నిరుపేద బాలింతలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. పట్టణంలోని పలువురు బాలింతలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని తన వంతు సాయంగా రూ.10 వేల విలువ చేసే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

హుండీ ఆదాయం రూ.2.5లక్షలు

అమరచింత: పట్టణంలోని హరిహర పుత్ర అయ్యప్ప ఆలయంలో ఈనెల 3న నిర్వహించిన మహాపూజ సందర్భంగా ఆలయానికి రూ.2,50,197 ఆదాయం సమకూరిందని ఆలయ, అధ్యక్ష కార్యదర్శులు మోదీ మనోహర్, రాజు, జాల్గి నరసింహులు, తాటికొండ రమేష్ తెలిపారు. మహాపూజ అనంతరం భక్తులు హుండీలో వేసిన నగదును సోమవారం లెక్కించగా.. రూ.2.5 లక్షల మేరకు నగదును భక్తులు సమర్పించారన్నారు. వీటితో పాటు ఇరవై క్వింటాళ్ల బియ్యం సైతం ఆలయానికి భక్తులు సమర్పించారన్నారు.

